రాగ ద్వేషాలు

టెంపోరావ్

గుప్తా యిచ్చిన పార్టీలో ఆనంద్ ఎక్కువగా స్కాచ్ విస్కీ సేవించాడు. తర్వాత డిన్నర్ లో పాల్గొన్నాడు. అప్పటికి టైము పదకొండు కావస్తోంది.

పార్టీ తర్వాత అదే హోటల్లో వున్న తన గదికి ఆనంద్ వెళ్ళలేదు. హోటల్లోంచి బయటకు నడిచాడు. రోజంతా వేడిగా వుంది ఢిల్లీలో. రాత్రి హాయిగావుంది. చల్లగాలిలో, చంద్రకాంతిలో నడవాలనిపించింది అతనికి.

హోటల్ గేటు దాటి అతడు రోడ్డమ్మట నడవ సాగాడు. రోడ్డు లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. రోడ్డు వారగా ఆనంద్ వుషారుగా నడుస్తున్నాడు.

అతడు ముందుకు చూశాడు. యెవరో యువతి అతడికి ముందు, కొంచెం దూరంలో నడుస్తోంది. రోడ్డు లైట్ల కాంతిలో ఆమె వెనుక భాగం మాత్రం అతడికి కనిపిస్తోంది. ఆనంద్ సిగరెట్ వెలిగించాడు. పొగవదుల్తూ ముందుకు అడుగులేస్తున్నాడు.

పాత అంబాసిడర్ కారు అతడి పక్కనుంచి దూసుకు పోయింది. కారులో ఆరడజనుమంది మనుషులున్నారని అతడు చూడగలాడు.

మరుక్షణంలో ఆ కారు ముందు వెళ్తూన్న యువతి పక్కనే ఆగింది. ఆగిన కారుకేసి చూసి ఆమె దూరంగా జరిగి నడవసాగింది.

కారు తలుపులు తటాలున తెరిచి నలుగురు మనుషులు కిందకు దూకారు. ఇదంతా గమనిస్తూ ఆనంద్ అటువైపు వేగంగా వెళ్ళాడు.

ఇద్దరు మనుషులు ఆమెను యిరువైపులా పట్టుకొని కారు దగ్గరకు యీడ్చుకుపోయారు. ఆమె అరుస్తోంది. వాళ్ళతో ఆమె ధైర్యంగా పోరాడుతోంది.

ఆనంద్ రోడ్డుకి యిరువైపులా చూశాడు. ఎక్కడా జనసంచారంలేదు. అతడు వేగంగా వాళ్ళవైపు పరుగెత్తాడు. కరాటేలో ఆనంద్ ఆరితేరినవాడు.

ఆమెను పట్టుకున్న వాళ్ళిద్దరూ బాతుల్లా దూరంగా ఎగిరిపడ్డారు. ఆనంద్ ఆమెవైపు చూశాడు.

"దూరంగా పొండి! మీ యింటికి పరుగెత్తండి! వీళ్ళ సంగతి నేను చూస్తాను" అరిచాడు ఆనంద్.

మరో యిద్దరు అతడితో కలియబడ్డారు. ఇనపకడ్డీ లాంటి చేతితో ఒకడి మెడమీద కొట్టి, రెండోవాడిని అతడు బూటు కాలితో తన్నాడు.

మెడవిరిగి ఒకడు నేలమీద కూలిపోయి మూలుగుతున్నాడు. రెండోవాడు కారు బోనెట్ మీదనుంచి అటువైపు ఎగిరిపడ్డాడు.

రోడ్డుమీద సగర్వంగా నిలబడి ఆనంద్ వాళ్ళవైపు చూశాడు.

"ఎవరేనా వుంటే రండి! మీ చేత మట్టి తినిపిస్తాను!"
అరిచాడు ఆనంద్.

కార్లో వున్న యిద్దరూ బయటకు దిగలేదు. కారు మెల్లిగా కదిలింది. నేలకూలిన వాళ్ళు లేచి పరుగెత్తుకు వెళ్ళి కార్లో మూరి తలుపులు మూశారు.

ఆనంద్ కారువైపు పరుగెత్తాడు. కారు నంబరు గుర్తుంచుకున్నాడు.

"మళ్లా యిటువంటి పనిచేస్తే ఎముకలు విరగ కొడ్తాను!" అరిచాడతను.

అంబాసిడర్ కారు దూసుకుపోయింది. రోడ్డు పొడుగునా చూశాడతను. ఆ యువతి రూపం యెక్కడా కనపడలేదు.

వెనకనుంచి ఒక తీయటి కంఠం విని ఆతడు త్రుళ్ళి పడ్డాడు.

"నన్ను రక్షించారు. మీకు నా థాంక్స్!"

వెనక్కి తిరిగి రోడ్డులైటు కాంతిలో ఆతడామెవైపు నవ్వుతూ చూశాడు.

ఆమె వయస్సు ఇరవై రెండు సంవత్సరములు వుండొచ్చు. చాలా అందమైన యువతి. కోల ముఖం. పెద్ద కళ్ళు. ఎర్రటి పెదిమలు. తీర్చిదిద్దిన ముక్కు, సన్నగా, పొడుగ్గా వుందామె. ప్రింటెడ్ సిల్కు చీర ధరించింది. మాచింగ్ జాకెట్. చేతిలో ఎర్రటి హేండ్ బాగ్.

"డోంట్ బాదర్! ఇంత రాత్రివేళ మీరు ఒంటరిగా వెళ్ళకూడదు" అన్నాడతను.

"ఇవాళ ఆఫీసులో పదిదాకా వుండవలసి వచ్చింది" అందామె.

"మీ యిల్లెక్కడ?"

"మరో కిలోమీటర్ దూరం వెళ్ళాలి!"

"నా పేరు ఆనంద్. మద్రాస్‌నుంచి వచ్చాను."

"నా పేరు లిమా" అందామె.

"వాళ్ళు మళ్ళా మీకోసం రావచ్చు! మిమ్మల్ని మీ యింటికి తీసుకువెళ్తాను."

"చాలా థాంక్స్" అందామె.

ఇద్దరూ పక్కపక్కనే నడవసాగారు. అతను ఏవో ప్రశ్నలు వేస్తున్నాడు. ఆమె నవ్వుతూ జవాబిస్తోంది.

కాస్సేపట్లో మెయిన్ రోడ్డునుంచి పక్క రోడ్డుకు తిరిగారు వాళ్ళు. ఒక యింటిముందు ఆమె ఆగింది. మూడంతస్తుల భవనం.

ముందు హాల్లో వున్న మెట్లెక్కి ఆమె పైకి వెళ్ళింది. ఆమె పక్కనే మెట్లెక్కాడు ఆనంద్.

ఒక ఫ్లాట్ ముందు ఆగి, తాళం తెరిచి లోపలకు వెళ్ళింది.

"ప్లీస్, కమిన్!" అందామె.

అతను లోపలకు నడిచాడు.

చిన్నగది. ఒకవైపున మంచం వుంది. రెండు పేము కుర్చీలున్నాయి.

గదిలోని ఫ్లోరసెంట్ లైట్ ప్రకాశవంతంగా వెల్గుతోంది. ఆనంద్ కుర్చీలో కూర్చుని గది నలువైపులా చూశాడు. ఆమె లోపలకు వెళ్ళింది. కాస్సేపట్లో తిరిగొచ్చింది.

"టీ చేసి యిస్తాను, వుండండి!"

"నో, వద్దు! కాస్సేపు ఇలా కూర్చోండి. మాట్లాడి పోతాను" అన్నాడతను.

ఆమె పేము కుర్చీలో కూర్చుంది. అతడివంక నవ్వుతూ

చూసింది.

"మీరీ ఫ్లాట్లో ఒంటరిగా వుంటున్నారా?" ప్రశ్నించాడతను ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

అతడివైపు ఆమె విచారవదనంతో చూసింది.

"నాకు తోడుగా అమ్మ వుండేది. ఆమె నెల క్రితం మరణించింది" అందామె.

"మీతో వుండడానికి మరెవరూ లేరా?"

ఆమె అడ్డంగా తలాడించింది.

"లిమా, ఈ ఢిల్లీ పట్నంలో ఎన్నో ఘోరాలు జరుగుతూ వుంటాయి. మీలాంటి అందమైన యువతి ఒంటరిగా వుండకూడదు" అన్నాడతను.

ఆటుపైన చాలా సేపటివరకూ యిద్దరూ మాట్లాడుతూ కూర్చున్నారు. బయట తలుపు మూసి ఆమె అతడిని లోపల గదిలోకి తీసుకువెళ్ళింది.

ఆమెకు ఎదురుగా అతను కూర్చున్నాడు. ఆమె తింటోంది. అతడు ఏమీ తిననన్నాడు. "నా గురించి అంతా చెప్పాను. మీ గురించి చెప్పండి" అందామె.

"నాది మద్రాస్. నాకు షుగర్ మిల్లు, సిమెంట్ ఫాక్టరీలు వున్నాయి. నాకు చిన్నతనంలోనే పెళ్ళయిపోయింది. ఒక కొడుకు వున్నాడు" అన్నాడతను.

తిండి ముగించి ఆమె చెయ్యి కడుక్కుంది. అతడు టైము చూశాడు. ఒంటిగంట కావస్తోంది.

ఇద్దరూ ముందు గదిలోకి వచ్చారు.

"లిమా, నేను వెళ్తాను" అన్నాడతను.

"ఇంత రాత్రివేళా? ఇక్కడ పడుకోండి. పొద్దుటే వెళ్ళొచ్చు" అందామె.

"ఫరే ఛేంజ్ మీరు నాతో హోటల్ కి రండి. అక్కడ బాగుంటుంది."

"ఇక్కడ బాగాలేదా?" అందామె.

అతడామెవైపు నవ్వుతూ చూశాడు.

"మీతో యెక్కడున్నా బాగానే వుంటుంది!"

ఆమె అతడివైపు అదోలా చూసింది.

"అయితే యిక్కడే వుండండి" అందామె.

"మీరు చెప్పినట్లే వుంటాను" అన్నాడతను.

మంచంమీద అతడు పడుకున్నాడు. కొంచెం దూరంలో నేలమీద మరో పరుపు వేసుకుని ఆమె పడుకుంది. గదిలో జీరోవాట్ బల్బు వెలుగుతోంది.

కాస్సేపట్లో ఆమెకు నిద్ర పట్టేసింది. అతడు సిగరెట్ పీలుస్తూ వెల్లకిలా పడుకుని పైకి చూస్తున్నాడు.

అమాంతంగా మూలుగుతూ ఆమె లేచింది. అతడామె పక్కకు వెళ్ళి పరుపుమీద కూర్చున్నాడు.

"శిమా, ఏమైంది?" అడిగాడతను.

అతడిని చూసి ఆమె ధైర్యం తెచ్చుకుంది.

"పీడకలొచ్చింది" అందామె,

"కలలో ఏం జరిగింది?"

"వాళ్ళు నన్ను ఎత్తుకుపోతున్నారు. నన్ను కాపాడ్డానికి మీరు వచ్చారు. మిమ్మల్ని వాళ్ళు కత్తితో పొడిచేశారు. రక్తం చూసి మేలుకొన్నాను" అందామె.

ఆనంద్ ఆమె వీపుమీద చెయ్యివేశాడు.

"వాళ్ళను గురించి నువ్వు భయపడుతున్నావు. నీకు ఏ భయమూ లేదు. నేను ఆ కారు నంబరు చెప్పి పోలీసు రిపోర్టు యిస్తాను. నీకు ఏ ప్రమాదమూ రాకుండా నేను చూస్తాను" అన్నాడతను.

అతడిచేయి కిందకు జారింది. ఆమె నడుమును చుట్టే సింది. ఆమె అతడి వంక విచిత్రంగా చూసింది.

"లిమా, విధి విచిత్రంగా మన్ని కలిపింది. నిన్ను యిక్కడ ఒంటరిగా వదిలి నేను మద్రాసు వెళ్ళను" అన్నాడతను.

పరుపుమీద ఆమె వెల్లకిలా పడుకుంది. అతడు లేవలేదు. ఆమెవైపే చూస్తున్నాడు. "లిమా, ఐ లవ్ యూ! నాకు పెళ్ళయిందని నీకు మొదట్లోనే చెప్పాను. అది పెద్దలు చేసిన పెళ్ళి. నేను కోరుకున్నది కాదు. నిన్ను ప్రేమించే నాకు నీ హృదయంలో స్థానం లభిస్తుందని ఆశిస్తున్నాను" అన్నాడతను వుద్రేకంతో.

"మీరు మద్రాసు వెళ్ళరా? ఇక్కడే వుండిపోతారా?" ప్రశ్నించిందామె.

"మద్రాసు వెళ్ళినా యిక్కడ కొంతకాలం నీతో వుంటూ వుంటాను. నీకోసం యింకో ఫ్లాట్ నేను అద్దెకు తీసుకుంటాను. అందులోకి నువ్వు మారొచ్చు. ఇటువైన ఉద్యోగం నువ్వు చేయొద్దు! నీకు ప్రతి నెలా నేను అయిదువేలు పంపుతాను."

ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారాయి. ఆమె అతడి చెయ్యి పట్టుకుంది.

"లిమా, ఏడుస్తున్నావా?"

"మనం కలుసుకుని మూడుగంటలింకా కాలేదు. కాని మీ మాటలు వింటూంటే మన అనుబంధం ఎన్ని జన్మలదో అనిపిస్తోంది!" అందామె.

అతడు ఆమెమీదకు వాలిపోయాడు. ఎర్రటి ఆమె పెదిమెలను బలంగా ముద్దెట్టుకున్నాడు. ఆమె చేతులు ఆవేశంతో అతడిని చుట్టేశాయి.

ఆ రాత్రంతా వాళ్ళు నిద్రపోలేదు. కిటికీలోంచి లోపలకు వెలుతురు ప్రసరించింది. అతడు టైము చూశాడు. ఏడు కావొస్తోంది.

అతడామెవంక నవ్వుతూ చూశాడు.

"మంచి ఫ్లాట్ కోసం యివాళ చూద్దాం. నువ్వు ఆఫీసుకు వెళ్లొద్దు!" అన్నాడతడు.

"వెళ్తే అక్కడ నిద్రపోతానేమో!" అందామె.

"రిమా, లే! పళ్ళుతోముకుని నా హోటల్ గదికి పోదాం. అక్కడ స్నానంచేసి బ్రేక్ ఫాస్టు సేవించి తర్వాత ఫ్లాట్ కోసం వెతుకుదాం!" అన్నాడతను.

2

పటేల్ స్ట్రీట్ లో వున్న పెద్ద భవనంలో ఒక ఫ్లాట్ ను ఆనంద్ అద్దెకు తీసుకున్నాడు. నెలకు వెయ్యి రూపాయిలు అద్దె. ఆరు నెలల అద్దె అతను డిపాజిట్టుగా చెల్లించాడు.

ఫ్లాట్ చాలా బాగుంది. రెండు పడకగదులు, హాలు, వంటిల్లు, బాత్ రూం వగైరా వున్నాయి. మర్నాడే ఆమె కొత్త ఫ్లాట్ లోకి మారిపోయింది. కంపెనీ ఉద్యోగం మానేసింది.

హోటల్ గది ఖాళీచేసి ఆనంద్ ఆమె ఫ్లాటుకు తన సామానులతో చేరుకున్నాడు.

వారం రోజులపాటు ఆనంద్ ఢిల్లీలోనే వుండి పోయాడు. వాళ్ళ జీవితాలు సుఖంగా, ఆనందంగా సాగి పోయాయి.

మద్రాసునుంచి టెలిగ్రామ్ వచ్చింది. ఆనంద్ అర్జంటుగా మద్రాస్ వెళ్ళాలి. అతడు ఆమెకు ధైర్యం చెప్పి, నెల లోపల తిరిగి వస్తానని హామీ యిచ్చి,

మద్రాస్‌కు బయల్దేరాడు.

ఏరోడ్రోమ్‌కు వెళ్ళి ఆమె అతడికి వీడ్కోలు చెప్పింది.

ఆనంద్ మద్రాస్ చేరుకున్నాడు. మద్రాస్ రాగానే ఆమెకు పెద్ద ఉత్తరం రాశాడు. తన కంపెనీ అడ్రెసు యిచ్చి ఆ అడ్రెసుకు జవాబు రాయమన్నాడు.

ఢిల్లీ వదిలేముందు ఆమెచేత పంజాబ్ నేషనల్ బాంకిలో అకౌంట్ ఓపెన్ చేయించాడు. ఆమె అకౌంటులో అతడు పదివేలు జమకట్టాడు.

వారం రోజుల్లో ఆమె ఉత్తరం వచ్చింది. "మీరాక కోసం ఎదురుచూస్తున్నాను" అందామె, ఎంతో రాస్తూ.

రోజులు గడిచిపోతున్నాయి. ఆమె ఉత్తరాలు రాస్తోంది. అతడు జవాబులిస్తున్నాడు. నెలతిరిగేలోగా అతడు ఢిల్లీ చేరుకున్నాడు. వారం రోజులు లిమాతో వుండి అతడు మద్రాస్‌కు తిరిగివచ్చాడు.

సంవత్సరం గడిచిపోయింది. లిమా గర్భవతి అయింది. రెండు నెలలపాటు ఆనంద్ ఢిల్లీలోనే వుండిపోయాడు. ఆమె కన్నబిడ్డను చూసి మురిసిపోయాడు. అచ్చంగా తన పోలికే!

ఆనంద్ మద్రాస్ వచ్చాడు. అతడి మనసు వాళ్ళ మీదే వుంది. వారం గడిచేలోపల అతడు తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయల్దేరాడు. కాని ఖాజీపేట దాటాక రైలుకి యాక్సిడెంట్ సంభవించింది. ఒంటి నిండా గాయాలతో ఆనంద్‌ని మరికొందరితోసహా మద్రాసుకు రైల్లో తీసుకు వచ్చారు.

కంపెనీలకు మేనేజరైన నాగరాజు సెంట్రల్ స్టేషన్‌కు వెళ్ళి ఆనంద్‌ని చూసి విచారంతో కృంగిపోయాడు.

మూడు నెలలపాటు ఆనంద్ హాస్పిటల్లో వున్నాడు.

తర్వాత యింటికి చేరుకున్నాడు. అతడు యిప్పుడు మునపటి ఆనంద్ కాదు!

రెండు కాళ్ళూ తీసివేయబడ్డాయి. ఎడం చెయ్యి పోయింది. ఒక కన్ను శాశ్వతంగా గుడ్డిదైంది. పరుపు మీద పడుకుని వున్న ఆనంద్‌ను చూసి అతడి భార్య పద్మ వెక్కి వెక్కి ఏడ్చింది. కాని తను ఏం చేయగలదు?

ఆనంద్ మంచంమీదనుంచి కదలలేదు. ఈ పరిస్థితుల్లో కంపెనీలను అతడి భార్య అన్న నాగరాజు చూస్తున్నాడు.

పరుపుమీద పడున్న ఆనంద్ మెదడులో లిమా రూపం మెదిలింది. యెవ్వరూ లేని సమయంలో అతడా మెకు ఉత్తరం రాశాడు. కవర్ని అంటించాడు. ఆ కవర్ని నాగరాజుకిచ్చి పోస్టు చేయించమన్నాడు. మూడు నెలలనుంచి ఆమెకు డబ్బు పంపలేదు. ఆమె పేర పంజాబ్ నేషనల్ బాంకికి యిరవై వేలు మెయిల్ ట్రాన్స్‌ఫర్ చేయమన్నాడు. నాగరాజు అలాగే చేయిస్తానన్నాడు. ఆనంద్ సంతోషించాడు తనిప్పుడు యితర్ల మీద ఆధారపడక తప్పదు!

నాగరాజు రహస్యంగా ఆనంద్ యిచ్చిన ఉత్తరం చదివాడు. అంతా అతడికి అర్థమైంది. నాగరాజు ఉత్తరాన్ని చింపి పారేశాడు. ఢిల్లీ బాంకికి డబ్బు పంపలేదు.

"నాకు పెర్సనల్‌గా ఆఫీసుకు ఉత్తరాలు వస్తే యిక్కడకు తెచ్చి నాకివ్వండి. మీరు తెరవొద్దు" అన్నాడు ఆనంద్.

"అలాగే యిస్తానండి" అన్నాడు నాగరాజు.

నెలలు గడిచిపోతున్నాయి. ఢిల్లీనుంచి వుత్తరంలేదు.

శిమా ఏమైంది? ఒక రోజు రాత్రి నిస్సహాయంగా ఆనంద్ నాగరాజు చెయ్యిపట్టుకున్నాడు.

"నాగరాజుగారూ, నేను కదిలే స్థితిలో లేను. మీరు నాకో చిన్న సహాయం చెయ్యాలి. ఈ విషయం మీ చెల్లెలుకి చెప్పొద్దు. ఆమెకు నేనే తర్వాత చెప్తాను" అని జరిగినదంతా చెప్పేశాడు.

"మీరు ఢిల్లీ వెళ్ళి ఆమె ఎలా వుందో చూసి రండి. మీతో 25 వేలు పట్టుకెళ్ళండి. నాకు జరిగిన ప్రమాదం గురించి చెప్పి ఆమెను యిక్కడకు రమ్మనండి."

"తప్పక ఆమెను తీసుకొస్తాను" అని నాగరాజు ఢిల్లీ వెళ్ళాడు.

ముందు హాల్లో శిమాను కల్సుకున్నాడు. చాలా అందమైన యువతి. ఏ మొగాడైనా ఆమెకు క్షణంలో దాసుడై పోతాడు!

"ఎవరు మీరు?" అందామె.

అతడు కంపెనీల పేర్లు చెప్పాడు.

"నేను ఆ కంపెనీల అధిపతిని. పేరు నాగరాజు. మీరు ఆనంద్ పేర మా కంపెనీ అడ్రెసుకు ఎన్నో ఉత్తరాలు రాశారు. మా కంపెనీలో ఆనంద్ అనేవాడు లేడు. కొన్ని ఉత్తరాలు చింపేశాను. మరికొన్ని మీరు రాసినవి నా జేబులో వున్నాయి" అని రెండు ఉత్తరాలను ఆమె ముందు పడేశాడు.

ఆమె ఆశ్చర్యంతో అతడివైపు చూసింది.

"ఆయన ఎన్నిసార్లో యిక్కడకు వచ్చారు. ఆ అడ్రెసుకు రాస్తే ఆయన జవాబులు కూడా యిచ్చారు" అందామె.

"అతడు ఎక్కడనుంచో మీకు జవాబులు రాసి

వుండాలి! ఇదంతా చూస్తే అతడు మోసగాడై వుండా లనిపిస్తోంది" అన్నాడతను.

"గుడ్ గాడ్, ఆనంద్ యింతగా నన్ను మోసం చేస్తాడని నేననుకోలేదు" అందామె.

"ఢిల్లీలో పనుండి వచ్చాను. ఈ విషయం మీతో చెప్పడం మంచిదని ఇలా వచ్చాను. జరిగిందేదో జరిగింది. ఆ మోసగాడిని మర్చిపోండి" అని అతడు బయటకు వెళ్ళి పోయాడు.

పెద్దమనిషిలా అగుపించే నాగరాజు మాటలు వినడంతో తన్ని మోసగించిన ఆనంద్ మీద ఆమెలో ద్వేషం రగులుకుంది.

ఆమె ఖరీదైన ఫ్లాట్‌ను ఖాళీచేసేసింది. చిన్న గది తీసుకుని అందులోకి మారింది. ఆమె హృదయంలో ఆనంద్ మీద కసి పెరుగుతోంది!

3

నాగరాజు తిరిగి వచ్చాడు. అతడు ఏం వార్త తెచ్చాడో? ఆనంద్ ఆత్రంగా అతడివైపు చూశాడు.

"ఆనంద్ గారూ, నేను చాలా విచారిస్తున్నాను. ఆమె ఆ ఫ్లాట్‌లో లేదు. ఖాళీచేసి యెక్కడికో పోయింది. పంజాబు నేషనల్ బాంకికి వెళ్ళి ఆమె గురించి అడిగాను. అక్కడి అకౌంట్ ఆమె మూసేసిందని వాళ్ళు చెప్పారు. ఆమె కోసం అనేకచోట్ల దర్యాప్తు చేశాను. కాని లభించలేదు!" అన్నాడు నాగరాజు.

ఆనంద్ మాట్లాడలేదు. పరుపుమీద పక్కకు తిరిగాడు. ఏడ్వసాగాడు.

"మీ వేదన నాకు తెలుసు. అందుకే యెంతో తాపత్రయపడ్డాను. చూద్దాం. ఆమెనుంచి ఉత్తరం

వస్తుందేమో!" అని నాగరాజు సెలవు తీసుకుని వెళ్ళి పోయాడు.

పసిపాపలా ఆనంద్ పరుపుమీద అటూ యిటూ దొర్లాడు. వారం తిరిగేలోపల ఆనంద్ ప్రమాదస్థితిలోకి జారిపోయాడు.

పెద్ద డాక్టర్ వచ్చి చూస్తున్నాడు, వెళ్తున్నాడు. ఆ రోజు రాత్రి ఆనంద్ చావు బ్రతుకులమధ్య అల్లల్లాడు తున్నాడు.

పక్కకూర్చున్న భార్య వైపు అతడు దీనంగా చూశాడు. ఆమె చేయి పట్టుకున్నాడు.

బరువుగా వూపిరి పీలుస్తూ లిమా గురించి ఆమెకంతా చెప్పాడు.

"పద్మా, నేను నిన్ను ప్రేమతో చూశాను. లిమాను ఎంతో ప్రేమతో నా చేతుల్లోకి తీసుకున్నాను. ఆమె యెక్కడుందో కనుక్కొని ఆమెకు నా ఆస్తిలో సగం వాటా యిచ్చేయి. నా మనసుకు శాంతి లభిస్తుంది" అన్నాడతను.

"తప్పక యిస్తాను" అందామె.

అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆనాటి రాత్రి నిద్రలో ఆనంద్ శాశ్వతంగా కన్ను మూశాడు.

వెక్కి వెక్కి ఏడుస్తూన్న చెల్లెల్ని ఓదారుస్తూ నాగరాజు ఆమె పక్కనే కూర్చున్నాడు.

"కాళ్ళూ చెయ్యీ పోయినా ఆయన బ్రతికి ఇంట్లో వున్నారని నేను ఆనందించేదాన్ని. ఇప్పుడు ఆ ఆనందమూ నాకు లేకుండాపోయింది" అని ఏడ్చిందామె.

"విధి అలా వుంటే మనం ఏం చెయ్యగలం?" అన్నాడు నాగరాజు.

"ఇప్పుడు నాకు దిక్కెవరు?" అరిచిందామె.

"చెల్లమ్మా, భయపడకు! నా మేనల్లుడు పెద్దవాడయ్యేదాకా కంపెనీలను నేను చూస్తూ వుంటాను, యిప్పటిలాగే. తర్వాత వాడికి అందజేస్తాను" అన్నాడతను.

"అన్నయ్యా, నువ్వు లేకపోతే నా గతి ఏమయ్యేదో" అందామె విచారంతో.

4

ఇరవై ఏళ్ళు గడిచిపోయాయి.

హాల్లో వున్న భర్త ఫోటోకు దండ వేసి, నమస్కరించి ఆమె వెనక్కు తిరిగింది.

వెనకనే నిలబడి వున్నాడు సత్యమూర్తి. తన ఇరవై మూడేళ్ళ కొడుకువైపు ఆమె దీనంగా చూసింది.

"ఆయన ఆఖరి కోర్కె తీర్చలేకపోయామురా" అందామె.

"అన్ని ప్రయత్నాలు చేశాం. మామయ్య ఎంతో ప్రయత్నించాడు. నేను కూడా ఢిల్లీ వెళ్ళి ఆమె కోసం వెతికాను. ఎక్కడా కనపడలేదుగా!" అన్నాడు సత్యమూర్తి.

"ఇన్నేళ్ళు అయ్యాక యింకా యెక్కడ కనిపిస్తుందామె! చెల్లీ, ఆమెను గురించి మర్చిపో!" అన్నాడు నాగరాజు.

అదే సమయంలో విశాలమైన హాల్లో టేబుల్ మీదున్న ఆనంద్ ఫోటో వైపు వాళ్ళిద్దరూ చూస్తున్నారు.

"ఆ మొహం చూడు! ఆ కళ్ళలో అంత మోసం వుంటుందని నేను వూహించలేదు" అంది లీమా.

తులసీరామ్ తల్లివైపు చూశాడు.

"అమ్మా, నేను మద్రాస్ వెళ్ళి అతడికోసం వెతుకుతాను. అతడిని లాక్కొచ్చి నీ కాళ్ళముందు పడేస్తాను" అన్నాడతను.

"అప్పుడు నేను ఏం చేస్తానో తెలుసా? అతడిని చిత్రవధ చేస్తాను!" అందామె.

అతడు విచిత్రంగా నవ్వాడు.

"అమ్మా, అంటావుకాని నా అంత కఠినంగా నువ్వు వుండలేవు!" అన్నాడతను.

లిమా ఉద్యోగం చేస్తూ కొడుకును పెంచింది. తన కొడుకు కోసం, అతడి అభివృద్ధికోసం మరో మొగాడి వైపు ఆమె చూడలేదు.

ఏళ్ళు గడిచినకొద్దీ ఆమె ఆదాయం పెరిగింది. ఎంతో ప్రేమతో తులసీరామ్‌ను పెంచింది. ఆఫీసు పనకాగానే కొడుకుతోనే కాలం గడిపేది.

లిమా, కొడుకు సోఫాలో కూర్చున్నారు. అతడి వయస్సు యిరవై వుంటుంది. అతడు చదువులోనేగాక అనేక విద్యల్లో నైపుణ్యం సంపాదించాడు. కరాటే నేర్చుకున్నాడు. కత్తి యుద్ధం, పిస్టల్ షూటింగ్ బాగా నేర్చుకున్నాడు.

"నాన్న ఏడంటే అతడికోసం నేనే వెతకాలని నువ్వు అనేదానవు, గుర్తుందా? టికెట్ కొన్నాను. మద్రాస్ వెళ్తాను" అన్నాడు తులసీరామ్.

"వెళ్ళిరా! ఆ మోసగాడు ఎక్కడో నీకు దొరుకుతాడు" అందామె.

గ్రాండ్ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో అతడు బయల్దేరాడు. జేబులో ఆనంద్ ఫోటో వుంది. అతడి కంపెనీల అడ్రెసు వుంది! మరో కోటుజేబులో పిస్టల్ వుంది. ఢిల్లీలో

దొంగల భయం ఎక్కువవడంవలన అతడు లైసెన్స్ సంపాదించి పిస్టల్ కొన్నాడు.

ట్రెయిన్ వేగంగాపోతోంది. తులసీరామ్ మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

అర్ధరాత్రి. ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌లో కింద బెర్త్ మీద సత్యమూర్తి గాఢ నిద్రలో వున్నాడు. అతడి తలకింద పెట్టెవుంది. ఎవరో దాన్ని లాగడం మూలంగా అతడు లేచి కూర్చున్నాడు. పెట్టె పట్టుకుని ఒకతను పారిపోబోయాడు. సత్యమూర్తి అతడి చొక్కా పట్టుకుని ఆపాడు. తటాలున కత్తి పైకి లేచింది.

కత్తికొన సత్యమూర్తివైపు తిరిగింది.

"నన్ను వదిలి దూరంగా వెళ్ళు! అరిస్తే చస్తావు" అరిచాడు దొంగ.

సత్యమూర్తి పట్టు వదిలేశాడు. అటువైపు వస్తూన్న ఒక యువకుడు అదంతా చూసి తటాలున దొంగను కాలితో తన్నాడు. కత్తి కిందపడింది. దొంగ సీటుపక్క పడ్డాడు.

అతడి చేతిలోని పెట్టెను ఆ యువకుడు సత్యమూర్తికి అందించాడు. కిందపడిన దొంగను రైల్వే పోలీసులకు అప్పగించాడు.

సత్యమూర్తి ఆ యువకుడితో కరచాలనం చేశాడు.

"మైడియర్ ఫ్రెండ్, చాలా థాంక్స్. ఆ పెట్టెలో చాలా డబ్బుంది. దాన్ని కాపాడావు. నన్ను రక్షించావు. నీ ఋణం తీర్చుకోలేను" అన్నాడు సత్యమూర్తి.

"దానికేముంది? కష్టంలో వున్న వాడికి సహాయపడకుండా ఎవరుండగలరు?" అన్నాడా యువకుడు.

"ప్లీస్, కూర్చో!" అన్నాడు సత్యమూర్తి.

ఆ యువకుడు నవ్వుతూ కూర్చున్నాడు.

"నా పేరు సత్యమూర్తి?" అన్నాడతను.

"నా పేరు తులసీరామ్" అన్నాడా యువకుడు.

"ఎక్కడికి వెళ్తున్నావు?"

"ఉద్యోగం కోసం వెతుకుతున్నాను. మద్రాస్ వెళ్తున్నాను."

"అక్కడ ఉద్యోగం దొరకొచ్చు. నాకు చాలామంది తెలుసు. నేను నీకు ఉద్యోగ విషయంలో సహాయ పడ్తాను" అన్నాడు సత్యమూర్తి.

"చాలా థాంక్స్. దురదృష్టవంతుడైన ఆ దొంగ నాకు అదృష్టాన్నే చేకూర్చాడు" అని తులసీరామ్ నవ్వాడు.

సత్యమూర్తి సిగరెట్ కేసు తెర్చాడు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు. పొగ వదులూ తులసీరామ్ బయటకు చూశాడు. చుట్టూ చీకటి. చీకట్లో ఎక్స్‌ప్రెస్ శరవేగంగా పోతోంది.

తులసీరామ్ నవ్వుతూ సత్యమూర్తివైపు చూశాడు.

"మద్రాసులో మోసగాళ్ళు వుంటారు అని అంటారు. అది నిజమేనా?" అడిగాడతను.

"మనుష్యుల్లో మోసగాళ్ళు వుంటారు, మంచివాళ్ళూ వుంటారు. ఈ ట్రెయిన్‌లో మనం ప్రయాణం చేస్తున్నాం—ఒక దొంగ నా పెట్టె లాక్కున్నాడు. ఓ పెద్ద మనిషి ఆ పెట్టెను తెచ్చి నాకిచ్చాడు. ఈ ప్రపంచ మంతటా అంతే!" అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

"నిజం చెప్పావు" అన్నాడు తులసీరామ్.

5

స్టేషన్ కి కారు వచ్చింది. సత్యమూర్తి తలుపు తెరిచి అతడిని కార్లో ఎక్కమన్నాడు.

వెనుక సీటుమీద ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. డ్రయివర్ కారును పోనిచ్చాడు.

పదినిమిషాల్లో కారు ఒక కాంపౌండులో ప్రవేశించి పోర్టికో కింద ఆగింది.

"వెల్ కమ్ టు మై హోమ్!" అన్నాడు సత్యమూర్తి తలుపు తెరిచి.

ఇద్దరూ కిందకు దిగి హాల్లోకి వెళ్ళారు. తల్లి పద్మ వాళ్ళకు హాల్లో ఎదురైంది.

"అమ్మా, ఇతను తులసీరామ్. ట్రెయిన్ లో ఒక దొంగ నా పెట్టె పట్టుకుని పారిపోబోయాడు. నన్ను కత్తితో భయపెట్టాడు. ఆ క్షణంలో యితను దేవుడిలా వచ్చి నన్ను కాపాడి, నా పెట్టె నాకిచ్చాడు" పరిచయం చేశాడు సత్యమూర్తి.

పద్మ నవ్వుతూ అతడివైపు చూసింది. ఆమె చూపు కొడుకువైపు తిరిగింది.

"ఇద్దరూ రామలక్ష్మణుల్లా వున్నారు!" అందామె.

సామానులను పట్టుకొని నౌఖరు హాల్లోకి వచ్చాడు.

"ఆ ఏర్ బాగ్ గెస్టురూమ్ లో పెట్టు" అన్నాడు సత్యమూర్తి.

సత్యమూర్తితో తులసీరామ్ గెస్టురూమ్ వైపు వెళ్ళిపోయాడు.

గెస్టురూమ్ శుభ్రంగా, విశాలంగా వుంది. మొజాయిక్ ఫ్లోరింగ్ ఎటాచ్ డ్ బాత్ రూమ్.

"మైడియర్ ఫ్రెండ్, స్నానంచేసి రెడీగా వుండు.

8-30కి బ్రేక్‌ఫాస్టు సేవించి మనం ఆఫీసుకు వెళ్దాం"
అన్నాడు సత్యమూర్తి.

ఎనిమిదింటికే తులసీరామ్ సిద్ధంగా వున్నాడు. ఆలోచిస్తూ అతడు సిగరెట్ వెలిగించాడు. పొగ వదుల్తూ ఆలోచించసాగాడు.

అనుకోకుండా ఒక మిత్రుడు దొరికాడు. ఉండడానికి ఒక గెస్టు రూమ్ దొరికింది. సత్యమూర్తి సహాయంతో ఆనంద్ గురించి దార్యాప్తు చేసి తను కనుక్కోవచ్చు!

సత్యమూర్తి గదిలోకొచ్చాడు.

"కమాన్ రామ్!" అన్నాడు.

"రెడీ, సత్యా!" అన్నాడు తులసీరామ్.

ఇద్దరూ హాల్లోకి వెళ్ళారు. తల్లి పద్మ భర్త ఫోటోకు దండ వేస్తోంది.

గోడమీదున్న ఫోటోవైపు తులసీరామ్ చూశాడు. దానివైపు తీక్షణంగా చూస్తూ వుండిపోయాడు. అతడి గుండె దడదడలాడింది. అతడికి ఢిల్లీలో వున్న తల్లి యిచ్చిన ఫోటో జ్ఞప్తికొచ్చింది.

"ఆ ఫోటో నాన్నగారిది. ఆయన పోయారు!" అన్నాడు సత్యమూర్తి.

సత్యమూర్తితో తులసీరామ్ కూడా గోడమీది ఫోటోకు నమస్కరించాడు. లోలోపల అనుకున్నాడు ద్వేషంతో: "దుర్మార్గుడా, నా తల్లిని మోసం చేసి యీ గోడమీద ఫోటో అయి పడున్నావా!"

ఇద్దరూ డైనింగ్ గదిలోకి వెళ్ళారు. తులసీరామ్ మెదడులో ఆలోచనలు పరుగెడుతున్నాయి. ఇది ఆనంద్ ఇల్లు! వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లు తను ఆనంద్ యింటికే వచ్చాడు. ఈ వార్త విని తన తల్లి చాలా

ఆనందిస్తుంది!

ఇద్దరూ టిఫిన్ తిని కాఫీ తాగారు. బయటకు వెళ్ళి కారు ఎక్కారు. కారు కదిలింది.

ఆఫీసుకు వెళ్తూ అక్కడున్న నేమ్ బోర్డుల వైపు చూశాడు తులసీరామ్. షుగర్ మిల్స్, సిమెంట్ ఫ్యాక్టరీలు! అవే పేర్లు, తన తల్లి చెప్పిన పేర్లే!

అందమైన ఆఫీసు గదిలోకి వెళ్ళారు యిద్దరూ. సత్యమూర్తి అతడిని కూర్చోమన్నాడు.

"ఇది మా కంపెనీల రిజిష్టర్డ్ ఆఫీసు. మా ఫ్యాక్టరీలు ఆంధ్రాలో, తమిళనాడులో వున్నాయి" అన్నాడతను.

తులసీరామ్ నవ్వాడు.

"రామ్, నువ్వు మా కంపెనీల్లోనే పని చేయొచ్చు!" అన్నాడు సత్యమూర్తి.

"అలాగే సత్యా, చాలా థాంక్స్."

"కొంత కాలంపాటు పని చేస్తే నీకు అనుభవం వస్తుంది. అసిస్టెంట్ మేనేజర్‌గా నీకు ఉద్యోగం యిస్తున్నాను. నెలకు వెయ్యి రూపాయిలు జీతం!" అన్నాడు సత్యమూర్తి.

"నేను చేసిన చిన్న సేవకు ఇంత పెద్ద బహుమతా?" అన్నాడు తులసీరామ్.

"మైడియర్ రామ్, తర్వాత నువ్వు యీ కంపెనీలకు ఎంతో ఉపయోగపడతావు" అన్నాడు సత్యమూర్తి.

"నాలో నీకు బాగా నమ్మకముంది సత్యా! థాంక్స్" అన్నాడు తులసీరామ్.

ఆనాటి రాత్రి సత్యమూర్తి, తులసీరామ్, తల్లి పద్మ భోజనాలు చేస్తున్నారు. వంటామె వడిస్తోంది.

అమాంతంగా బాంబు పేలినట్లు హాల్లోనుంచి చప్పుడు

వెలువడింది. అందరూ ఉలిక్కిపడ్డారు. పద్మ చెవులు మూసుకుంది. అందరూ హాల్లోకి పరుగెత్తారు.

గోడమీద మేకు బోడిగా వుంది. దానికి వేళ్ళాడే ఆనంద్ ఫోటో మొజాయిక్ ఫ్లోర్ మీద పడి గ్లాసు ముక్కలైంది. పూలదండ పక్కనే పడుంది.

సత్యమూర్తి ఫోటోను పరీక్షగా చూశాడు.

“తాడు తెగిందమ్మా!” అన్నాడు.

“వారానికొకసారి సుబ్బయ్య చూస్తూ వుంటాడు. ఎలా తెగుతుంది?” అంది పద్మ.

“నాలుగు రోజులైందమ్మా నేను చూసి. తాడు గట్టిగానే వుందమ్మా” అన్నాడు సుబ్బయ్య.

“రాబోయే తుఫానుకు యిది నాంది!” అనుకున్నాడు తులసీరామ్ లోలోపల.

“బెంగపడకమ్మా! ఇవాళే కొత్త ఫ్రేమ్ వేయిస్తాను” అన్నాడు సత్యమూర్తి.

6

అదే కాంపౌండులో నాగరాజు యిల్లు వేరుగా వుంది. సత్యమూర్తి నాగరాజు యింటికి వెళ్ళాడు.

“బావా!” అంది సుజాత.

నవ్వుతూ అతను నాగరాజు గదిలోకి వెళ్ళాడు. నాగరాజు ఏదో ఫైలు చూస్తున్నాడు.

“రా, బాబూ, కూర్చో!” అన్నాడు నాగరాజు.

సత్యమూర్తి కూర్చున్నాడు.

“సత్యా, ఎంత కాలంనుంచో నేను అనుకుంటున్నాను. సుజాతను నువ్వు పెళ్ళాడాలని. ఈ సంవత్సరం మీ పెళ్ళి జరగాలని నా ఆశ!”

"మామయ్యా, మీరు పెద్దలు. నన్ను వృద్ధిలోకి తీసుకొచ్చారు. సుజాతను పెళ్ళాడాలనే ఉద్దేశం నాకు లేదు. మేమిద్దరం చాలా దగ్గరగా పెరిగాం! ఆమెకోసం మరెవరినేనా చూడండి!" అన్నాడు సత్యమూర్తి.

"అంతేనంటావా?"

"అంతే, మామయ్యా. మీరు కోరినది జరగలేదని బాధపడకండి. సుజాతకు మంచి భర్త వస్తాడు."

మావయ్య గదిలోంచి సత్యమూర్తి వెళ్ళిపోయాడు.

టైమ్ రెండయింది. ఆఫీసులో సత్యమూర్తికి ఎదురుగా కూర్చున్నాడు తులసీరామ్.

"2-30కి నేను బయటకు వెళ్ళి అలా యింటికి పోతాను. నీకిచ్చిన పని పూర్తిచేయి ఇవాళే" అన్నాడు సత్యమూర్తి.

"అలాగే, సత్యా" అని తులసీరామ్ వెళ్ళిపోయాడు.

తులసీరామ్ మెల్లిగ టాయిలెట్ గదిలోకి వెళ్ళి కాస్సేపట్లో బయటకొచ్చి మెట్లవైపు నడిచాడు. టైము చూశాడు. 2-25 దాటింది. జేబులోంచి బాటిల్ తీసి అందులో వున్న సోప్ ద్రవాన్ని మెట్లకు కప్పిన లినోలియం పైన పోశాడు.

వేగంగా పైకి వెళ్ళిపోయాడు.

సత్యమూర్తి హుషారుగా మెట్లు దిగుతున్నాడు. హఠాత్తుగా కాలుజారి పడి, జారుతూ కొంతదూరం వెళ్ళి అతడు ఆపుకోగల్గాడు.

ఆఫీసులోనుంచి ఆ నేకమంది అతడివైపు పరుగెత్తారు.

"జాగ్రత్త, జారుతుంది!" అరిచాడు సత్యమూర్తి.

తులసీరామ్, మరో యిద్దరు జాగ్రత్తగా దిగి అతడిని లేవదీశారు. సత్యమూర్తి ధరించిన సూటు ఒకచోట

చిరిగింది. చెయ్యిమీద గాట్లుపడ్డాయి.

"లక్కీ, యూ ఆర్ ఆల్ రైట్ సత్యా!" అన్నాడు తులసీరామ్.

"అక్కడ ఎలా జారింది?" అన్నాడు సత్యమూర్తి.

ఎవ్వరూ జవాబివ్వలేదు.

"అదంతా క్లీన్ చేయించు" అన్నాడు సత్యమూర్తి తులసీరామ్‌తో.

"వెంటనే చేయిస్తాను" అన్నాడు తులసీరామ్.

ఉద్యోగంలో చేరాక తులసీరామ్ ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని అక్కడకు మారాడు. అతడు తల్లికి మూడు ఉత్తరాలు రాశాడు.

"అమ్మా, ఆనంద్‌ని లాక్కొచ్చి నీ కాళ్ళముందు పడేస్తానన్నాను. కాని అది సాధ్యంకాదు. ఆనంద్ యీ లోకంలో లేడు. గోడమీద ఫోటోఅయి కూర్చున్నాడు. మొన్న ఆ ఫోటోను తునాతునకలు చేశాను. అద్దం పగిలింగి. మళ్ళీ ఫ్రేము కట్టించారు. తల్లి పద్మ, కొడుకు సత్యమూర్తి ఆనంద్ చేసిన మోసానికి శిక్ష అనుభవిస్తున్నారు!" అన్నాడతను ఒక ఉత్తరంలో.

ఇంకా ఆఫీసుకు టైమ్ కాలేదు. తులసీరామ్ ఉత్తరం తీసుకుని పోస్టు చేయడానికి బయటకు వెళ్ళాడు. రోడ్డమ్మట నడుస్తున్నాడు. వెనుకనుంచి సైకిల్ చక్రం అతడికి తగిలింది. వెనుదిరిగి అతను హేండిల్ బార్ పట్టుకున్నాడు.

"మిష్టర్ వదులు!" అరిచిందామె.

"మనుషులమీదకు సైకిల్ నడుపుతున్నావు!"

"నువ్వు కళ్ళు మూసుకుని నడుస్తున్నావు!" అందామె.

ఆమె కోపంగా కిందకు దిగింది. అతడింకా హేండిల్ బారును వదలలేదు.

"పోస్టు బాక్సుదాకా నాకు నువ్వు తోడు దొరికి నందుకు సంతోషిస్తున్నాను" అన్నాడతను.

"నిన్ను యెక్కడో చూశాను" అందామె.

"కల్లో చూసుంటావు!"

"నీలాంటి రౌడీలు నాకు కలల్లో కనిపించరు!"

మరికొంత దూరం నడిచాక యిద్దరు స్నేహితులు అయ్యారు.

"నా పేరు సుజాత" అందామె.

"నా పేరు తులసీరామ్" అన్నాడతను.

అలా ప్రారంభమైన వాళ్ళ స్నేహం ప్రణయంగా మారింది.

7

ఆఫీసుకు కారు పోతోంది. మౌంటు రోడ్డుమీద ఒక చోట కారును ఆపమని సత్యమూర్తి సౌజ్ఞ చేశాడు. యెప్పుడూ అక్కడ ఆపడం పరిపాటి అయింది.

సత్యమూర్తి దిగి సమీపంలో వున్న జైహింద్ క్లాత్ షాపువైపు వెళ్ళాడు. షాపు అందంగా వుంది. ఇద్దరు యువతులు కష్టమర్సుకు కావలసినవి చూపించి అమ్ముతున్నారు.

సత్యమూర్తిని చూడగానే ఒక యువతి ముందు కొచ్చింది.

"ఏం కావాలి సార్?" అందామె.

"టీ షర్టు" అన్నాడతను.

ఆమె అనేక రకాల టీ షర్టులను అతడిముందు కౌంటరుమీద పడేసింది. అన్నీ చూసి అతడు ఒకటి

తీసుకున్నాడు.

డబ్బు చెల్లించి, కవరులో వున్న టీ షర్టు తీసుకుని అతడు వెళ్ళిపోయాడు.

అతడికి టీ షర్టు అమ్మిన యువతి రెండో యువతి వైపు చూసి కళ్ళు చిట్లించింది.

"రోజూ ఒక టీ షర్టు కొంటున్నాడతను" అంది రమ.

"నీ మీద మోజు కనిపిస్తోంది" అంది మేనక కొంటెగా.

"అతడొక మాడ్ చాప్ అయివుండాలి! ఈసారి అతను వచ్చినపుడు నువ్వు వెళ్ళు, కొంటాడో లేదో చూద్దాం" అంది రమ.

"నేను అటో యిటో తేల్చేస్తాను. రమ మీద మోజుంటే టీ షర్టులు కొనక్కర లేదని చెప్పేస్తాను. పాపం నీ మూలంగా అతడికి నష్టం దేనికి?" అంది మేనక.

"నీ మాటలు వింటుంటే నన్ను ప్రేమించే ప్రిన్స్ చార్మింగ్ వచ్చాడనిపిస్తోంది!" అంది రమ నవ్వుతూ.

మర్నాడు అదే టైముకు వచ్చాడతను. మేనక నవ్వుతూ ముందుకు వెళ్ళింది.

"ఏం కావాలి, సార్" అందామె.

ఆమె వైపు చూస్తూ మౌనంగా వుండిపోయాడతను.

ఆమె విచిత్రంగా నవ్వింది.

"వుండండి ఆమెను పంపుతాను" అంది మేనక.

"ప్లీజ్ వద్దు! నాకు మీరే కావాలి! మీరే!" అన్నాడతను.

"నేనా?"

"అవును మీరే. మీకోసమే నేను రోజూ ఇక్కడకు

వస్తున్నాను."

"ఈ షాపులో అమ్మకానికి పెట్టిన వస్తువుని కాను నేను!" అందామె నవ్వుతూ.

"అది నాకు తెలుసు. డబ్బు కొనలేనిది హృదయంతో పొందుచ్చు. మీతో మాట్లాడాలి. ఎప్పుడు నన్ను కలుసు కోగలరు?" అన్నాడు సత్యమూర్తి.

"సాయంత్రం ఆరింటికి నేను షాపు వదిలి యింటికి బయలేరతాను" అందామె.

"థాంక్స్, అప్పుడు కలుసుకుంటాను. బై" అని అతను కదిలాడు.

సూర్యుడు అస్తమించాడు. షాపుల్లోని లైట్లు వెల్గుతున్నాయి. తనే కారును స్వయంగా నడుపుతూ వచ్చాడు సత్యమూర్తి. ఒకచోట కారును ఆపి, సీటుమీదే కూర్చుని షాపువైపు చూస్తున్నాడు.

మేనక షాపులోంచి బయటకు వచ్చి యిటూ అటూ చూసింది. సత్యమూర్తిని ఆమె గుర్తించింది. అతడి కారు వైపు నడిచింది.

"ఏం మాట్లాడాలి?" అందామె.

అతడు ముందు తలుపు తెరిచాడు.

"ఎక్కండి, చెప్తాను" అన్నాడు.

ఆమె అతడివైపు పరీక్షగా చూసింది. సీటుమీద కూర్చుని తలుపు మూసింది.

"ప్రథమ పరీక్షలో పాసయ్యాను. సంతోషం" అని అతడు కారును పోనిచ్చాడు.

కొంతసేపు యిద్దరూ మౌనంగా వున్నారు.

"మీ పేరు నాకు తెలియదు. నా పేరు సత్యమూర్తి."

"నా పేరు మేనక" అందామె.

కారును మెల్లిగా పోనిస్తున్నాడతను.

"నాకో మంచి హోటల్ తెలుసు. అక్కడ మనం కూర్చుని తింటూ మాట్లాడుకోవచ్చు" అన్నాడతను.

"మీకు ఆకలిగా వుంటే పదండి!" అందామె.

"మీకు ఆకలి లేకపోతే మానేద్దాం" అన్నాడతను.

"మీరు ఏం చెప్తారో వినాలన్న ఆకలి బాగావుంది" అంది మేనక నవ్వుతూ.

హోటల్ పిక్నిక్ కాంపౌండులో అతడు కారు ఆపాడు. ఇద్దరూ దిగారు. తోటలో గొడుగుకింద ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

బేరర్ రాగానే సత్యమూర్తి ఆర్డరిచ్చాడు. ఆమె వైపు ప్రేమతో చూశాడతను.

మేనక ఎంతో అందంగా వుంది. ఆమె కళ్ళు ప్రకాశిస్తున్నట్లు వున్నాయి.

"మొదటిసారి ఆ షాపులో మిమ్మల్ని చూసినప్పటి నుంచీ మీ రూపమే నా హృదయంలో నృత్యం చేస్తోంది. మిమ్మల్ని పెళ్ళాడతాను!"

"ఇటుపైన నాతో బహువచనంలో మాట్లాడకండి!"

"అది యిద్దరికీ వర్తించాలి" అన్నాడతను.

ఆమె అతడి కళ్ళలోకి చూసింది.

"సత్యా, నేను పేదపిల్లని. నువ్వు ధనవంతుడిలా కనిపిస్తున్నావు. మీ పెద్దలు ఈ పెళ్ళికి ఒప్పుకుంటారా?" అందామె.

"మా నాన్న పోయారు. అమ్మ మాత్రం వుంది. ఆమె అడ్డు చెప్పదు."

బేరర్ ప్లేట్లు తెచ్చి పెట్టి వెళ్ళిపోయాడు. ఇద్దరూ తింటూ ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ కూర్చున్నారు.

మెల్లిగా సత్యమూర్తి ఆమె చెయ్యిని పట్టుకున్నాడు. "నీతో యిలా శాశ్వతంగా కూర్చోవాలనిపిస్తోంది" అన్నాడు ఉద్రేకంతో.

బేరర్ కాఫీ తెచ్చాడు. బిల్లు టేబులుమీద ప్లేటులో పెట్టాడు. సత్యమూర్తి ప్లేటులో రెండు నోట్లు పడేశాడు. ప్లేటు తీసుకుని బేరర్ కదిలాడు. కాఫీ తాగాక సత్యమూర్తి, మేనక వుషారుగా కారువైపు నడిచారు.

8

మహాబలిపురం పిక్నిక్కి వెళ్ళి సత్యమూర్తి, అతడి మిత్రులు నాలుగు కార్లలో తిరిగి వస్తున్నారు.

ముందు కారులో సత్యమూర్తి, మేనక మాత్రం వున్నారు. వెనుకనున్న మూడు కార్లలో అతడి మిత్రులు వున్నారు.

"పెట్రోలు పోయించాలి" అని సత్యమూర్తి కారును ఒక బంకు ముందుకు పోనిచ్చాడు.

తతిమ్మా కార్లు దూరంగా రోడ్డుమీద ఆగివున్నాయి. కార్లలోంచి కొందరు కిందకు దిగారు.

తులసీరామ్ కార్లోంచి దిగి సమీపంలో వున్న టాక్సీ దగ్గరకు వెళ్ళాడు. టాక్సీ డ్రయివర్ కారులో కూర్చుని వున్నాడు.

తులసీరామ్ అతడి చేతిలో పదిరూపాయిల నోటు పెట్టాడు.

"నేను సిగ్నల్ యివ్వగానే కారుతో దూసుకుపో!" అన్నాడు.

"అలాగే సార్" అన్నాడు డ్రయివర్.

టాక్సీపక్కనుంచి తులసీరామ్ పెట్రోల్ బంక్ వైపు చూశాడు. సత్యమూర్తి కారు టాంకులో పెట్రోలు

పోస్తున్నాడు ఒకతను. తులసీరామ్ చుట్ట వెలిగించాడు. కాల్తున్న చుట్టను అమాంతంగా సత్యమూర్తి కారు టాంక్ వైపు రాకెట్ లా పంపాడు.

టాక్సీ డ్రయివర్ కి సిగ్నల్ యిచ్చి తను రోడ్డు మీదున్న కార్ల వైపు వేగంగా నడిచాడు.

తటాలున కారు వెనకనుంచి మంటలు పైకి లేచాయి. పెట్రోలు పోసే అతను భయంకరంగా అర్చాడు. పెట్రోలు సరఫరా ఆపేశాడు. దూరంగా పరుగెత్తాడు. పెట్రోలు బంక్ రక్షించబడింది కాని సత్యమూర్తి కారు టాంక్ లోని పెట్రోలు మండుతోంది. సత్యమూర్తి, మేనక కిందకు దూకారు. ఇద్దరూ దూరంగా పరుగెత్తారు.

సత్యమూర్తి కారును మంటలు చుట్టేశాయి. పది నిమిషాల్లో మంటల ప్రళయ తాండవం ముగిసింది. సీట్లు, రూఫింగ్ తెల్లు దగ్ధమై సత్యమూర్తి కారు వికృత రూపం దాల్చింది.

తులసీరామ్, యితర మిత్రులు సత్యమూర్తి దగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

"కారు పోతే పోయింది, మీరు క్షేమంగా వున్నారు" అన్నాడు తులసీరామ్.

సత్యమూర్తి ఆలోచిస్తూ వాళ్ళవైపు చూశాడు.

"ఎవరో ఏదో పెట్రోల్ టాంక్ వైపు విసిరారు!" అన్నాడు సత్యమూర్తి.

"అక్కడున్న ఒక టాక్సీ దూసుకుపోయింది" అన్నాడు తులసీరామ్.

"ఆ టాక్సీలో వున్నతనే టాంక్ వైపు ఏ సిగరట్టో విసిరివుండాలి" అన్నాడొక మిత్రుడు.

"పోలీసు రిపోర్టివ్వాలి" అన్నాడు సత్యమూర్తి.

తులసీరామ్ పోలీసులకు ఫోన్ చేశాడు. కాస్సేపట్లో పోలీసు జీప్ వచ్చి ఆగింది.

ఇన్‌స్పెక్టర్ నాయర్, నలుగురు కానిస్టేబుల్సు కిందకు దిగారు.

"నా పేరు సత్యమూర్తి. ఆ కారు నాది" అన్నాడు సత్యమూర్తి.

కాలిపోయిన కారును పరీక్షించి ఇన్‌స్పెక్టర్ నాయర్ నలువైపులా వెతికాడు.

కారుకి కొంచెం దూరంలో నేలమీద పడున్న చుట్ట కనిపించింది! చుట్ట ఆరిపోలేదు. ఇంకా కాల్తోంది!

బంక్ మనిషి చుట్టవైపు చూశాడు.

"ఆ చుట్టని ఎవరో కారు టాంక్ వైపు విసిరారు" అన్నాడు బంక్ మనిషి.

ఇన్‌స్పెక్టర్ అందరివైపూ చూశాడు.

"చుట్ట విసిరిన వ్యక్తిని ఎవరేనా చూశారా?" గంభీరంగా ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

ఎవ్వరూ చూడలేదు! అందరూ మౌనంగా వున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ చూపు సత్యమూర్తివైపు వెళ్ళింది.

"సత్యమూర్తిగారూ, ఈ చుట్ట సగంపైన యింకా కాలకుండా వుంది. చుట్టపీకయితే ఎవరో కాల్చి నిర్లక్ష్యంగా విసిరారు అనుకోవచ్చు. ఇది అలా కాదు. చుట్టను వెలిగించి వెంటనే కారు టాంక్ వైపు యెవరో విసిరారు. మిమ్మల్ని చంపడానికి ఎవరో ప్రయత్నించారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సత్యమూర్తి వులిక్కిపడ్డాడు. గాభరాగా మేనక అతడి చెయ్యి పట్టుకుంది.

"నన్ను చంపితే వాళ్ళకు ఏ విధంగా లాభిస్తుంది?" అడిగాడు సత్యమూర్తి.

"అది కనుక్కోవలసిన విషయం" అన్నాడు ఇన్స్పెక్టర్ నాయర్.

అక్కడనుంచి దూసుకుపోయిన టాక్సీని గురించి తులసీరామ్ ఇన్స్పెక్టర్కి చెప్పాడు.

"ఫైన్! చుట్ట విసిరినవాడు ఆ టాక్సీలో వెళ్ళిపోయి వుండాలి. టాక్సీ నంబరు ఎవరేనా చూశారా?"

అందరూ మౌనంగా వున్నారు. ఎవ్వరూ చూడలేదు.

"సత్యమూర్తిగారూ, మీరు ఇటుపైన జాగ్రత్తగా వుండడం మంచిది. ఎక్కడికీ ఒంటరిగా వెళ్ళకండి" అని ఇన్స్పెక్టర్ సలహా యిచ్చాడు.

తులసీరామ్ ఆప్యాయంగా సత్యమూర్తి చెయ్యి పట్టుకున్నాడు.

"ఇటుపైన నీతో నేను కూడా వుంటాను. నీకు ఏ ప్రమాదం రాకుండా చూస్తాను" అన్నాడు తులసీరామ్.

ఇన్స్పెక్టర్ అతడివైపు పరీక్షగా చూశాడు.

"ఎవరితను?" అన్నాడు నాయర్.

"నా ప్రియమిత్రుడు. నా కంపెనీలోనే పని చేస్తున్నాడు" అన్నాడు సత్యమూర్తి.

ఇన్స్పెక్టర్కి రిటన్ రిపోర్టు అందించి సత్యమూర్తి, మేనక, తులసీరామ్ కారులో ప్రయాణం సాగించారు. తులసీరామ్ కారును పోనిస్తున్నాడు. అతడి పక్కన ఇద్దరు మిత్రులు వున్నారు. వెనుక సీటుమీద సత్యమూర్తి మేనక మాత్రం వున్నారు.

"ఇన్స్పెక్టర్ ఏదో వూహిస్తున్నాడు. నన్ను చంపడానికి ఎవ్వరూ ప్రయత్నించరు" అన్నాడు సత్యమూర్తి.

"అయినా మనం జాగ్రత్తగా వుండడం మంచిది" అన్నాడు తులసీరామ్.

9

సుజాత తండ్రికి కాఫీ గ్లాసు అందించి ఎదురుగా నిలబడింది. నాగరాజు ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"అమ్మాయి ఏదేనా అడగాలా?"

"అవును, నాన్నా" అందామె.

బావతో తన పెళ్ళి విషయం గురించి ఆమె అడుగుతుందేమో అని అతడనుకున్నాడు.

"నీ పెళ్ళి త్వరలో జరుగుతుందమ్మా!" అన్నాడతను.

"ఆ విషయమే మాట్లాడాలి."

"ఏమిటో చెప్పు!"

"నాకోసం మీరు ఏ సంబంధాలూ చూడొద్దు. నేను పెళ్ళాడబోయే యువకుడిని నేనే కనుక్కున్నాను."

"ఎవరతను?"

"మీ కంపెనీలో నే పనిచేస్తున్నాడు."

"మా కంపెనీలలో కొన్ని వందలమంది పనిచేస్తున్నారు. పేరు చెప్పు!"

"అతనే, తులసీరామ్."

నాగరాజు తృళ్ళిపడ్డాడు.

"అతని వలలో ఎలా పడ్డావు?"

"ఇద్దరం ప్రేమించుకున్నాం. అతడినే పెళ్ళాడతాను."

నాగరాజు ఆమెవైపు సూటిగా చూశాడు.

"అతడిని గురించి మనకు ఏమీ తెలియదు. సత్యా తీసుకొచ్చి ఉద్యోగం యిచ్చాడు. ఆ ఉద్యోగంలో ఎంతకాలం వుంటాడో!"

ఆమె తీయగా నవ్వింది.

"నన్ను వదిలి అతను ఎక్కడికీ పోడు నాన్నా!" అందామె.

"నీ వయసులో తెల్లనివన్నీ పాలలాగే అగుపిస్తాయి. జీవితంలో కొన్ని దెబ్బలు తింటేగాని నిజం తెలియదు" అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. కొంతసేపు తండ్రివైపు సూటిగా చూసింది.

"అతడిని యిక్కడకు రమ్మని చెప్తాను. మీరు మాట్లాడండి."

"ఎప్పుడొస్తాడు?"

"మీకు వీలు ఉన్నప్పుడు" అందామె.

"రేపు రాత్రి భోజనానికి రమ్మను, ఏడింటికి. మాట్లాడి చూస్తాను."

మర్నాడు ఏడింటికి తులసీరామ్ ఆమె యింటికి చేరుకున్నాడు. సుజాత నవ్వుతూ అతడిని ఆహ్వానించింది.

విశాలమైన హాల్లో చక్కటి సోఫాలున్నాయి— అతడు కూర్చున్నాడు. సుజాత మెరుస్తూన్న కళ్ళతో అతడివైపు చూసింది.

"నాన్న వస్తాడు, కూర్చో!" అందామె.

"నేను నీకోసం వచ్చాను, మీ నాన్నకోసం కాదు." నాగరాజు అప్పుడే హాల్లోకొచ్చాడు.

సోఫాలో కూర్చుని అతడివైపు నాగరాజు పరీక్షగా చూశాడు. యువకుడు బాగున్నాడు. అతడు పంజాబీ అని సత్యమూర్తి చెప్పడం నాగరాజుకు గుర్తుకొచ్చింది. పంజాబీలు రూపంలో బాగానే వుంటారు.

"అమ్మాయి, నువ్వు లోపలకు వెళ్ళు!" అన్నాడతను.

సుజాత లోపలకు వెళ్ళింది. తల్లితో మాట్లాడుతూ కూర్చుంది.

తన ఆఫీసులో అతడు పనిచేస్తున్నాడు. ఇప్పుడతను యింటి అల్లుడు కానున్నాడు.

"తులసీరామ్, అమ్మాయి అంతా చెప్పింది. నా ఒక్కగా నొక్క కూతురు సుజాత. మీరిద్దరూ నిజంగా ప్రేమించుకుంటే నేను సంతోషంగా సమ్మతించి మిమ్మల్ని దీవిస్తాను."

"థాంక్స్, సార్" అన్నాడతను క్లుప్తంగా.

"నీ తలిదండ్రులకు యీ విషయం గురించి రాశావా?"

"నాన్న పోయారు. అమ్మకు రాశాను."

"ఆమె ఒప్పుకుందా?"

తులసీరామ్ నవ్వాడు.

"అమ్మ ప్రేమించి పెళ్ళాడింది."

"మీ అమ్మగారు ఎక్కడున్నారు?"

"ఆమె ఢిల్లీలో ఉద్యోగం చేస్తోంది. ఆమెది గొప్ప హృదయం. నాకోసం తన ఆనందాన్ని త్యాగం చేసింది."

"అటువంటి త్యాగమూర్తులు కొందరు వుంటారు" అన్నాడు నాగరాజు.

నాగరాజు సిగరెట్ పాకెట్ తెర్చి అతడికి యివ్వబోయాడు.

"మీరు కాల్చండి. నా బ్రాండు వేరు. థాంక్స్."

"మీ అమ్మ పేరు?"

"లిమా!" అన్నాడు తులసీరామ్.

లిమా! లిమా! అనుకున్నాడు నాగరాజు లోలోల. ఆ పేరు తను విన్నాడు. ఎక్కడ? ఎప్పుడు?

సుజాత కూల్ డ్రింక్ తెచ్చి తులసీరామ్ పక్కనున్న

టీపాయిమీద పెట్టింది. మెల్లిగా ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

లిమా పేరు తనకు ఎలా తెలుసో గుర్తించగానే ఆతడి గుండె దడదడ కొట్టుకుంది. లిమా! ఆనంద్ ప్రియురాలు! ఢిల్లీలో ఆమెను కల్సుకుని ఎన్నో అబద్ధాలు చెప్పాడతను. అదంతా యీ యువకుడికి తెలియక పోవచ్చు! కాని పెళ్ళికి ఆమె మద్రాసు వస్తుంది. తన్ని గుర్తుపడుంది! ఆమె తనని మన్నిస్తుందా?

లిమా అనే పేరు అనేకమందికి వుండొచ్చు. తులసీరామ్ తల్లి లిమా మరెవరో కావచ్చు!

"తులసీరామ్! నేనొకసారి ఢిల్లీ వెళ్ళి యీ పెళ్ళి విషయం మీ అమ్మగారితో మాట్లాడతాను" అన్నాడు నాగరాజు.

"వెళ్ళడం అనవసరం. అయినా కావాలంటే వెళ్ళండి" అన్నాడతను.

నాగరాజు ఒక నిర్ణయానికి వచ్చాడు. లిమా ఆమె కావచ్చు, కాకపోవచ్చు!

లిమా ఆనంద్ ప్రియురాలే అయితే ఆమెకు అంతా ముందుగా చెప్పి తనని క్షమించమని వేడుకోవాలి!

"అమ్మాయి!" పిల్చాడతను.

సుజాత హాల్లోకొచ్చింది. నవ్వుతూ అతను సోఫాలోంచి లేచాడు. వాళ్ళిద్దరివైపు నవ్వుతూ చూశాడు.

"మీరు మాట్లాడుకుంటూ వుండండి. నేను స్నానం చేసి వస్తాను" అని నాగరాజు వెళ్ళిపోయాడు.

10

ఢిల్లీ చేరుకున్న నాగరాజు పొద్దుట లిమా ఫ్లాట్ కు వెళ్ళాడు. ఆమె లేదు. సాయంత్రం ఆరు దాటాక ఆమె

వసుంధరని పక్కవాళ్ళు చెప్పారు. అతడు తన హోటల్ కి వెళ్ళిపోయాడు.

అతడు లిమా ఫ్లాట్ కు చీకటిపడ్డాక వెళ్ళాడు. ఇంట్లోని ఫ్లోరసెంట్ లైట్లు వెలుగుతున్నాయి.

అతడు తలుపుమీద తట్టాడు. హాల్లో కూర్చున్న లిమా "కమిన్ !" అంది.

అతడు లోపలకు వెళ్ళాడు.

"కూర్చోండి" అందామె,

ఆమె కెదురుగా సోఫాలో కూర్చున్నాడతను.

ఆమె వైపు చూశాడు. లిమా ఆమే! సందేహంలేదు. ఆమె తనని గుర్తుపడుతుందా? నాగరాజు అనే వ్యక్తిని ఆమె మర్చిపోయి వుండవచ్చు!

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"నాగరాజుగారూ, యిరవై ఏళ్ళ తర్వాత మిమ్మల్ని నాముందు మళ్ళీ చూస్తున్నాను!" అందామె.

అతడు త్రుళ్ళిపడ్డాడు.

"నేను మీకు జ్ఞాపకమున్నానా?"

"అబ్బాయి మీ ఫోటోను నాకు పంపాడు. ఆనంద్ మీ చెల్లెలి భర్తని రాశాడు. ఆనాడు మీరన్ని అబద్ధాలు యెందుకు చెప్పారో నాకు అర్థమైంది. ఆనంద్ ఆ అడ్రసులో వున్నాడంటే నేను అతడికి ఉత్తరాలు రాస్తాను. అక్కడ ఆనంద్ అనే వ్యక్తి లేడని చెప్పారు. నన్నూ, ఆనంద్ నీ మీరు దూరం చేశారు. మీరు ఆనంద్ ని మోసగాడుగా చిత్రించారు. మీ మాటలు నమ్మాను. మోసపోయానని ఏడ్చాను. మీ మూలంగా ఆనంద్ మీద నాకు కసి కూడా ఏర్పడింది...."

ఆమె చెప్పుకుపోతోంది. నాగరాజు లేచాడు. ఆమె

కాళ్ళముందు నేలమీద కూర్చున్నాడు.

"మీకంతా తెలియదు. నేను చెప్పేది వినండి!"

"చెప్పండి" అందామె.

"ఆనంద్ కు మీరంటే ఎంతో ప్రేమ. మీకోసం తమిళనాడు ఎక్స్ప్రెస్ లో ఢిల్లీ కి వస్తూంటే రైలు యాక్సిడెంట్ అయింది. కాళ్ళూ, ఎడంచెయ్యీ ఒక కన్నూ పోయాయి. అతడు పరుపుమీద పడివుండేవాడు. ఆ క్షణంలో కూడా అతడి మనసు మీమీదే వుండేది. ఎన్నో ఉత్తరాలో రాసి పోస్టు చేయమని నాకిచ్చాడు. మీ బాంకికి డబ్బు ప్రతి నెలా పంపమన్నాడు. చివరికి నన్ను ఢిల్లీ పంపాడు. ఇక్కడికొచ్చి మీతో నేను అబద్ధాలు చెప్పాను.

అతడు ఆగి ఆమెవైపు చూశాడు. ఆమె ముఖం విచారంగా వుంది.

"చనిపోయే ముందు అతడు మీ గురించి తన భార్యతో చెప్పాడు. మీరు యెక్కడున్నారో కనుక్కొని తన ఆస్తిలో సగం మీకీయమన్నాడు. ఆమె అలాగే చేస్తానంది. ఆమె నన్ను ఢిల్లీ పంపింది. నేను వచ్చి వెతికాను. మీరు ఆ ఫ్లాట్ లో లేరు. విచారంతో వెళ్ళిపోయాను."

ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

"నా మేనల్లుడు సత్యమూర్తి పెద్దవాడయ్యాడు. నా చెల్లెలు అతడిని ఢిల్లీ పంపింది. కాని లాభంలేకపోయింది. తన భర్త ఆఖరి కోర్కె తీర్చలేక పోయాయని నా చెల్లెలు రోజూ ఏడుస్తూ వుంటుంది."

లిమా వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఆనంద్ మిమ్మల్ని మరువలేదు. మిమ్మల్ని హృద

యంలో వుంచుకని, నిస్సహాయ స్థితిలో అతను మరణించాడు. మీరు మద్రాసు రండి. మిమ్మల్ని చూసి నా చెల్లెలు ఆనందిస్తుంది. తులసీరామ్ మీ కొడుకని తెలిసి అందరూ సంతోషిస్తారు. మొదటిసారి సత్యమూర్తినీ, తులసీరామ్‌నీ చూసి నా చెల్లెలు పద్మ ఏమందో మీరు వినాలి" అన్నాడతను.

"ఏమందామె?" అడిగిందామె.

"రామలక్ష్మణుల్లా వున్నారు అందామె."

లీమా సోఫాలో కూర్చుని పిచ్చిగా ఏడుస్తోంది. నాగరాజు కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

హాల్లోని టెలిఫోన్ మ్రోగింది. ఆమె వెళ్ళి రిసీవర్ అందుకుంది.

"హాలో!" అందామె.

"అమ్మా, నేను, తులసీరామ్. ఇంతవరకూ నీకు ఉత్తరాలు మాత్రం రాశాను. ఇప్పుడు నాగరాజుగారి యింటినుంచి నీకు డైరెక్టు డయలింగ్ చేసి మాట్లాడుతున్నాను" అన్నాడతను.

ఆమె పిచ్చిగా ఏడ్చింది.

"అమ్మా, ఏడుస్తున్నావా?" అడిగాడతను.

"రామ్, ఏడుస్తున్నాను! నీ తండ్రి ఆనంద్ కోసం ఏడుస్తున్నాను. నాగరాజు యిక్కడున్నారు. అంతా తెలిసింది. అజ్ఞానంలో ఆనంద్ మీద నేను ద్వేషం, కసి పెంచుకున్నాను. అదే నీకు నూరిపోశాను. కాని యిప్పుడంతా మారిపోయింది, రామ్!"

ఆమె ఏడుస్తోంది.

"అమ్మా!" అన్నాడతను.

"ఆనంద్ మనల్ని మోసం చేయలేదు. విధి ఆతడిని మనకు దూరం చేసింది."

"అమ్మా, నువ్వు చెప్పింది వింటే ఏడవాలనిపిస్తోంది" అన్నాడతను.

"రామ్, సత్యమూర్తి, ఆతడి తల్లి పద్మ అందరూ మంచివాళ్ళే."

"అయితే నీ జీవితం ఎందుకలా అయిందమ్మా?"

"నాగరాజు చెప్పిన అబద్ధాలు మూలంగా!"

"అయితే సుజాతను నేను మర్చిపోతాను!" అన్నాడతను.

"రామ్, వద్దు. పెద్దల పాపాలను పిల్లలమీద మనం రుద్దకూడదు. నాగరాజును నేను మన్నించాను. నీలో నేను రేకెత్తించిన ద్వేషాన్ని తొలగించి నీ హృదయాన్ని ప్రేమతో నింపుకో!"

"అమ్మా, అలాగే చేస్తాను."

"నాగరాజుతో కలిసి నేను మద్రాసు వస్తున్నాను. ఆనంద్ ఫోటో ఎదురుగా మనం అందరం కలుసుకుందాం" అందామె.

"నీ రాకకోసం ఎదురు చూస్తూ వుంటానమ్మా."

ఆమె రిసీవర్ పెట్టేసింది. నాగరాజు వైపు ఆమె కన్నీళ్ళతో చూసింది.

"నాగరాజుగారూ, ఆనంద్ ఆత్మశాంతి కోసం గతాన్ని మర్చిపోదాం. రేపు మీరూ, నేనూ మద్రాస్ కు వెళ్దాం" అందామె.

"అమ్మా లిమా, నువ్వొక దేవతవి!" అన్నాడు నాగరాజు.

11

పద్మ ఆప్యాయంగా లిమాను కౌగలించుకుంది.

"చెల్లీ, నువ్వు యిక్కడకు వచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాను. ఆయన ఆఖరి కోర్కె యివాళ నెరవేరింది. ఇటుపైన నువ్వూ, తులసీరామ్ ఈ ఇంట్లోనే వుండాలి. ఇది మీ యిల్లు" అంది పద్మ.

సత్యమూర్తి ఆప్యాయంగా తులసీరామ్‌ను తన హృదయంలోనికి హత్తుకున్నాడు.

"మైడియర్ బ్రదర్, నాన్నగారు ఎన్ని కంపెనీలో స్థాపించి వెళ్ళిపోయారు. మనిద్దరం వాటిని జయప్రదంగా నడపాలి" అన్నాడు సత్యమూర్తి.

తులసీరామ్ కన్నీళ్ళతో సత్యమూర్తివైపు చూశాడు.

"అన్నయ్యా, నేను కసితో మద్రాస్ వచ్చాను. నేను ఎన్నో తప్పులు, నేరాలు చేశాను. ఏ విధి మన్ని దూరం చేసిందో అదే విధి నీకు ప్రమాదం రాకుండా కాపాడి నందుకు నేను ఆనందిస్తున్నాను."

"మైడియర్ బ్రదర్, గతాన్ని మర్చిపో! నాన్నగారి ఆదర్శాలను పాటిస్తూ యిటుపైన మనం నడుచుకుందాం" అన్నాడు సత్యమూర్తి.

అందరూ హాల్లో గోడమీదున్న ఆనంద్ ఫోటోవైపు మానంగా చూసి, చేతులు జోడించి నమస్కరించారు.

—:అయిపోయింది:—